క్లుప్తంగా

షిప్‌యార్డ్ కార్మికులకు మీల్స్ అలవెన్స్ పెంపు



మీల్స్ అలవెన్స్ పెంపు సవరణ పత్రాన్ని గుర్తింపు యూనియన్ సభ్యులకు అందిస్తున్న షిప్‌యార్డ్ అధికారులు

సింధియా: హిందుస్తాన్ షిప్‌యార్డ్‌లో పని చేస్తున్న సుమారు 738 మంది కార్మికులకు మీల్స్ అలవెన్స్ రూ.58 నుంచి రూ.100కు పెంచుతూ సంస్థ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ (ఐఎన్‌టీయూసీ) ప్రధాన కార్యదర్శి పైలా శ్రీరామమూర్తి సారథ్యంలో చర్చలు సఫలం కావడంతో షిప్‌యార్డ్ 84వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కార్మికుల సమక్షంలో అలవెన్సులు పెంచుతున్నట్లు యాజమాన్యం ప్రకటించింది. పెంచిన మీల్స్ అలవెన్సు జూలై 1వ తేదీ నుంచి అమలు చేయనున్నారు. అలవెన్సు పెంచడంతో గుర్తింపు యూనియన్‌కు సహకరించిన సంస్థ సీ అండ్ ఎండీకి, డైరెక్టర్లు, హెచ్‌ఆర్ విభాగ అధికారులకు షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ (ఐఎన్‌టీయూసీ) సభ్యులు శుక్రవారం ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు వినతులు



సీపీకి వినతులు అందజేస్తున్న సిబ్బంది

అల్లిపురం: నగర పోలీస్ కమిషనరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సిబ్బంది గ్రీవెన్స్‌కు స్పందన లభించింది. శాంతి భద్రతలు, ట్రాఫిక్, క్రైమ్, ఏఆర్‌కు సంబంధించి 30 మంది సిబ్బంది శాఖాపరమైన సమస్యలపై నేరుగా సీపీ డాక్టర్ రవిశంకర్‌కు వినతులు అందజేశారు. ఇంక్రిమెంట్లు, డిప్యుటేషన్, ఆరోగ్య సమస్యలు, ప్రమోషన్లకు సంబంధించి అందిన వినతులపై స్పందించిన సీపీ వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ



గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–1 వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం గిరి ప్రదక్షిణ జరిగింది. జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభమైన గిరి ప్రదక్షిణ ఆద్యంతం భక్తిప్రపత్తులతో సాగింది. ప్రాంగణమంతా గోవింద నామస్మరణతో మార్మోగింది. ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, హరి స్వామి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పార్సిళ్లను పరిశీలించాలి



పార్సిల్ సర్వీస్ సంస్థల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఏడీసీపీ (సెబ్) శ్రీనివాసరావు

విశాఖ సిటీ : కస్టమర్ల పార్సిళ్లను నిర్వాహకులు తప్పకుండా పరిశీలించాలని ఏడీసీపీ (సెబ్) బి.శ్రీనివాసరావు పార్సిల్ సర్వీస్ ఆఫీస్ మేనేజర్లకు సూచించారు. నగరంలో కొన్ని పార్సిల్ సర్వీస్ సంస్థల ద్వారా తెలిసీ తెలియక గంజాయి అక్రమ రవాణా అవుతున్నట్లు సమాచారం మేరకు శుక్రవారం పోలీస్ సమావేశ మందిరంలో ఆయా సంస్థల నిర్వాహకులు, మేనేజర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. గంజాయి అక్రమ రవాణా నేరమని, తెలిసినా, తెలియక పోయినా పార్సిళ్లలో డ్రగ్స్ లేదా గంజాయి పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆరోగ్య ప్రదాయిని యోగా

- యోగా డే వేడుకల్లో వక్తలు
- ఉత్సాహంగా విద్యార్థుల యోగాసనాలు



గోపాలపట్నం హైస్కూల్ ఇండోర్ స్టేడియంలో యోగాసనాలు వేస్తున్న డీసీపీ మేకా సత్తిబాబు, విద్యార్థులు



బెహరా కళాశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



నరవ ఇంజనీరింగ్ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు



సెయింట్ ఆన్స్ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థినులు



90వ వార్డు అల్లూరి పార్కులో యోగాసనాలు వేస్తున్న సాధకులు



యోగా సాధకులతో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: మానసిక, శారీరక ఆరోగ్యానికి యోగా ఎంతో ఉపకరిస్తుందని, అందరూ యోగా సాధన చేయాలని జోన్–2 డీసీపీ మేకా సత్తిబాబు సూచించారు. నియోజకవర్గంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో డీసీపీ పాల్గొని యోగా గురువు సూచించిన యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, పలు వ్యాధులను సైతం దూరం చేస్తుందని తెలిపారు. నగరంలో డ్రగ్స్, గంజాయి నియంత్రణకు పోలీసులు పటిష్ట చర్యలు చేపడుతున్నారన్నారు. నేటి యువత వాటి జోలికి పోవద్దని హితవు పలికారు. పోలీసులు చేపడుతున్న ఈ కార్యక్రమంలో ప్రజల సహకారం అవసరమని కోరారు. టీడీపీ యువ నాయకుడు పెతకంశెట్టి మౌర్యసింహ, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నరవ బెహరా విద్యా సంస్థలో.

నరవ బెహరా పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులచే యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సుకన్య మాట్లాడుతూ భారతీయ యోగాకు అంతర్జాతీయ గుర్తింపు వచ్చినందుకు సంతోషంగా ఉందన్నారు. మన పూర్వీకులు అందించిన యోగా విద్యను అందరూ అభ్యసించాలని, ప్రతి రోజూ పాటించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు వసంత, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

నరవ ఇంజినీరింగ్ కళాశాలలో..

నరవ విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో యోగా డే వేడుకలను ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వి.ప్రదీప్ ప్రారంభించారు. యోగాసనాలు తాను వేస్తూ విద్యార్థులచే వేయించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, అధ్యాపకులు, ఉమెన్స్ గ్రీవెన్స్ సెల్ విభాగం సభ్యులు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.


యోగాతో మానసిక ఒత్తిడి దూరం

మల్కాపురం: యోగాతో మానసిక ఒత్తిడి తగ్గుతుందని, వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని జాతీయ సేవా పథకం ప్రోగాం అధికారి, యోగా శిక్షకురాలు సంధ్యారాణి అన్నారు. సెయింట్ ఆన్స్ కళాశాలలో యోగా దినోత్సవం సందర్భంగా విద్యార్థినులకు యోగాపై శిక్షణ ఇచ్చారు. యోగా అభ్యాసనం చేసిన విద్యార్థులతో పాటు యోగా శిక్షకురాలను కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ ప్రేమకుమారి అభినందించారు. ఎ.ఆదిలక్ష్మి, శివరంజని ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు వై.అనసూయాదేవి, నదియా, అంజలీదేవి, అధ్యాపకురాలు జయశ్రీ, తులసి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

విశాఖ విద్య: యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. జీవీఎంసీ 52వ వార్డు మద్రిపాలెం వుడా లేఅవుట్ గ్రీన్ బెల్ట్ ప్రాంగణంలో నిర్వహించిన యోగా డే వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా యోగా సాధన చేయటం ఎంతో అవసరమన్నారు. యోగసాధకులకు మజ్జిగను శ్రీధర్ స్వయంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ నిర్వాహకుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. 90వ వార్డు అల్లూరి సీతారామరాజు పార్కులో నిర్వహించిన యోగా డే వేడుకల్లో పరిసర కాలనీలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు. నిర్వాహకులు యోగా సాధన చేయించారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

వెదుళ్ల శ్రీనుకు పరామర్శ



శ్రీనును పరామర్శిస్తున్న అల్లా కృష్ణ

విశాఖ విద్య: జీవీఎంసీ శానిటరీ ఉద్యోగి వెదుళ్ల శ్రీనును మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లా కృష్ణ శుక్రవారం పరామర్శించారు. అనారోగ్యంతో స్థానిక ఆస్పత్రిలో శ్రీను ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

నృసింహ స్వామికి వైభవంగా గరుడ సేవ

- పాల్గొన్న లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్, ఈవో శ్రీనివాసమూర్తి
- పోటెత్తిన ఒడిశా భక్తులు



అమ్మవార్లు వేంజేసిన పల్లకీ మోస్తున్న లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్, ఈవో శ్రీనివాసమూర్తి



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్, ఈవో దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిర్వహించిన గరుడ సేవలో ఒడిశా భక్తులు తరించారు. లక్ష్మీకాంత్ నాయక్‌దాస్ స్వామికి ఈసేవను జరిపించారు. ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్, పట్టుపురం, బరంపురం, పూరి, రాయగడ తదితర ప్రాంతాల నుంచి భక్తులు ఈ సేవకు హాజరయ్యారు. సాయంత్రం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అలంకరించి వెండి గరుడ వాహనంపై అధిష్టించారు. శ్రీదేవి,భూదేవి అమ్మవార్లను పల్లకీలో వేంచేయజేసి మంగళ వాయిద్యాలు, భక్తుల జేజేలు మధ్య గరుడసేవ నిర్వహించారు. వింజామరతో లక్ష్మీకాంత్ నాయక్ దాస్ స్వామికి సేవలందించగా, తమ సంప్రదాయం ప్రకారం ఒడిశా భక్తులు స్వామిని కీర్తించారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు ఈసేవ నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి సతీసమేతంగా పాల్గొన్నారు.

ఆశ్రమంలో మతి స్థిమితం లేని మహిళ



వివేకానందం ఆశ్రమంలో మహిళ

దాబాగార్డెన్స్: మతి స్థిమితం లేని అనుపమ అనే 25 ఏళ్ల మహిళను కొంత మంది స్వామి వివేకానంద ఆశ్రమంలో చేర్పించారు. ఈమె ఆచూకీ తెలిసిన వారు పాతనగరం సమీపాన గల స్వామి వివేకానంద సంస్థను సంప్రదించాలని సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తెలిపారు. లేదా వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించాలన్నారు. ఆచూకీ తెలిసిన వారు 8297568913 నంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

'నీట్' లీకేజీపై నిరసన జ్వాల



జీవీఎంసీ గాంధీ పార్కులో నిరసన తెలుపుతున్న ఏఐఎస్‌ఈసీ ప్రతినిధులు

సీతమ్మధార: నీట్–2024 పరీక్ష పేపర్ లీకేజీపై నిరసనలు కొనసాగుతున్నాయి. ఏఐఎస్‌ఈసీ ఆధ్వర్యంలో నీట్ విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం జీవీఎంసీ గాంధీ పార్కులో ఆందోళన చేపట్టారు. ఏఐఎస్‌ఈసీ రాష్ట్ర సలహాదారుడు డాక్టర్ ఎన్.చంద్రశేఖర్ మాట్లాడుతూ లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఎన్‌టీఏను రద్దు చేయాలని, నిజాయతీగా పరీక్ష రాసిన విద్యార్థులందరికీ న్యాయం చేయాలని, నీట్ కుంభకోణంలో దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. అధ్యాపకులు శంకరరావు, సుబ్రహ్మణ్యేశ్వరరావు, విశ్రాంత ఉపాధ్యాయులు సత్యవతి, ఎస్.గోవింద్, పాల్గొన్నారు.

ఐసీఏఐ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం



యోగాసనాలు వేస్తున్న అకౌంటెంట్స్

విశాఖ సిటీ: ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) విశాఖ ఛాప్టర్(ఎస్ఐఆర్‌సీ) ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. నగరంలోని ఛార్టెర్డ్ అకౌంటెంట్ సభ్యులతోపాటు వారి కుటుంబ సభ్యులు పాల్గొని ఆసనాలు వేశారు. యోగా ఫర్ సెల్ఫ్ అండ్ సొసైటీ అనే థీమ్‌తో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా మానసిక ఒత్తిడిని జయించి శారీరక దారుఢ్యాన్ని పొందవచ్చని అకౌంటెంట్స్ పేర్కొన్నారు. ఏయూలో యోగా డిప్లమో హోల్డర్ మింటి త్రిమూర్తులు సభ్యులను చైతన్యపరిచారు. మేనేజింగ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బ్రాంచ్ చైర్మన్ అనిర్బాన్ పాల్, కార్యదర్శి పట్నాల లోకేష్, సీఏ వాసుదేవ మూర్తి, స్టూడెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్కూల్ ఆటోడ్రైవర్లు భద్రతా నియమాలు పాటించాలి

- ట్రాఫిక్ ఎస్‌ఐ భాస్కర్



సదస్సులో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్ఐ భాస్కర్

విశాఖ సిటీ: నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థుల కోసం ప్రత్యేకంగా తిరుగుతున్న ఆటోడ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు కచ్చితంగా పాటించాలని ద్వారకానగర్ ట్రాఫిక్ విభాగం ఎస్‌ఐ భాస్కర్ సూచించారు. ద్వారకానగర్ శ్రీచైతన్య స్కూల్‌లో రహదారి భద్రతపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ రవికిరణ్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఎస్ఐ భాస్కర్ మాట్లాడుతూ ప్రతి ఆటోడ్రైవర్ తమ వాహనానికి సంబంధించిన పత్రాలను ఎప్పటికప్పుడు రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. స్కూల్ ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ సిబ్బంది నిర్వహించే తనిఖీలకు సహకరించాలన్నారు. విద్యార్థులతో వస్తున్నప్పుడు డ్రైవర్లు రహదారి క్రమశిక్షణ పాటించాలని ఆదేశించారు. ప్రిన్సిపాల్ రవికిరణ్ మాట్లాడుతూ భావితరాలకు వారధులైన విద్యార్థుల భద్రత ఆటోడ్రైవర్ల చేతుల్లో ఉందన్నారు. అలాగే బాలికల భద్రత విషయంలోనూ డ్రైవర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రిన్సిపల్ సూచించారు. సమావేశంలో శ్రీ చైతన్య పాఠశాలల ఏజీఎం ఎంవీ సురేష్, ఆర్ఐ అలీ, డీన్‌లు గౌరినాయుడు, సురేష్, ఏవో దిలీప్ పాల్గొన్నారు.

రైతుబజార్లలో పార్కింగ్ నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట: కంచరపాలెం, గోపాలపట్నం రైతుబజార్లలోని ఖాళీ స్థలంలో పార్కింగ్ ప్రాంతం నిర్వహణ కోసం ఒక ఏడాది కాలానికి బహిరంగ వేలం నిర్వహిస్తున్నారు. జులై 1 నుంచి వచ్చే ఏడాది జూన్ 30 వరకు పార్కింగ్ నిర్వహణ కోసం ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ వేలంలో పాల్గొనే వారు రూ.10 వేల ధరావత్తు సొమ్మును జిల్లా జాయింట్ కలెక్టర్, రైతుబజార్లు, విశాఖపట్నం వారి పేరున డీడీని జత చేసి దరఖాస్తులను పంపాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 22 నుంచి 28వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట లోపు అందజేయాలన్నారు. 28న సాయంత్రం 4 గంటలకు కలెక్టర్ కార్యాలయం ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తామని, బేస్ రేట్లు కూడా ఇస్తామని వివరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేలం పాట నిర్వహిస్తామన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులు, ఇతర ఫారాలను జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ అధికారి, డోర్ నంబర్ 8.202/2, ఆర్ ఆర్ వెంకటాపురం, గోపాలపట్నం, రైతుబజార్ పక్కన, విశాఖపట్నం–530029కు అందించాలన్నారు. వివరాలకు 90308 19082 నంబర్‌లో సంప్రదించాలని జేసీ కోరారు.

వేతనాల చెల్లింపులో యాజమాన్యం నిర్లక్ష్యం

- ఇలాగే కొనసాగితే ఉక్కు సీఎండీ, ఉన్నతాధికారుల ఇళ్ల ముట్టడి
- ఉక్కు కార్మిక సంఘాల నాయకుల హెచ్చరిక
- 1,226వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు



దీక్షా శిబిరంలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికుల వేతనాలను తక్షణమే చెల్లించకపోతే సీఎండీతో పాటు ఉన్నతాధికారులను తిరగనిచ్చేది లేదని ఉక్కు కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు. కూర్మన్నపాలెం కూడలిలోని ఉక్కు రిలే దీక్షా శిబిరంలో 1226వ రోజు, శుక్రవారం డబ్ల్యూఎండీ, టీటీఐ, టౌన్ అడ్మిన్, యుటిలిటీ విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డి.ఆదినారాయణ, డీసీహెచ్. వెంకటేశ్వరరావు, వరసాల శ్రీనివాసరావు మాట్లాడారు. కార్మికుల వేతనాల విషయంలో యాజమాన్యం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోందన్నారు. యాజమాన్య వైఖరి వల్ల ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు మానసిక ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఏ క్షణమైనా ఉక్కు సీఎండీ, ఉన్నతాధికారుల ఇళ్లను ముట్టడి చేయనున్నామన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్నా యాజమాన్యమే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు గుమ్మడి నరేంద్ర, వరప్రసాద్, అప్పలరాజు, శివ, కణితి అప్పారావు, శ్రీను, గేదెల ఈశ్వరరావు, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

అల్లిపురం: పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన రైల్వే క్వార్టర్స్‌లోని ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులను ప్రోత్సహించేందుకు గాను ఆరుగురికి అకడమిక్ ఎక్సలెన్స్ అవార్డులు అందజేశారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో గేదెల తిరుమలేసు, యలమంచిలి యశ్వంత్, తంగేటి వెంకట కార్తీక్‌లకు పడాల రత్నాలు అకడమిక్ ఎక్సలెన్స్ స్కాలర్‌షిప్ కింద రూ.5 వేల నగదు, సర్టిఫికెట్, మెడల్లు అందజేశారు. అవార్డులు ప్రదానం చేసిన డి.రమణి, డి.లక్ష్మి, ఇన్‌చార్జి హెచ్‌ఎం సుధ పాల్గొన్నారు.

ఘనంగా ఉమా చంద్రమౌళీశ్వర స్వామి కల్యాణోత్సవం



ప్రత్యేక అలంకరణలో ఉమాచంద్రమౌళీశ్వర స్వామి వారు



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

అల్లిపురం : టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో వెలసిన శ్రీ ఉమా చంద్రమౌళీశ్వర స్వామి వార్షిక కల్యాణోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో జీవీ రమాబాయి ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు భార్గవశర్మ శైవాగమన సంప్రదాయంలో కల్యాణం జరిపించారు. కళ్యాణంలో పాల్గొన్న దంపతులకు ఈవో స్వామివారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ముందుగా స్వామివారి ఉత్సవ విగ్రహాల తిరువీధి ఉత్సవం అస్సాం గార్డెన్స్, టూటౌన్ రోడ్డు, డాబాగార్డెన్స్, నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం మీదుగా సాగి దేవస్థానానికి చేరుకుంది. ఈ కార్యక్రమంలో అక్కాజోశ్యుల రమేష్ శర్మ, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, ఆలయ సిబ్బంది మన్మథరెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉక్కు రిటైర్డ్ ఉద్యోగి మృతి



నాగార్జునరావు మృతదేహం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పవర్‌గ్రిడ్ సమీపంలో విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగి ఒకరు మృతి చెందారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్టీల్‌ప్లాంట్‌లో పదవీ విరమణ చేసిన పైలా నాగార్జునరావు(62) కూర్మన్నపాలెంలో ఉంటున్నారు. శుక్రవారం మధ్యాహ్నం కారులో టౌన్‌షిప్ వెళ్లారు. అక్కడి నుంచి దేశపాత్రునిపాలెం మార్గంలో వెళ్తుండగా కారు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొంది. దీంతో విద్యుత్ స్తంభం ఒరిగిపోవడంతో పాటు కారు ముందు భాగం నుజ్జయింది. ఈ ఘటనలో నాగార్జునరావు అక్కడికక్కడే మృతి చెందారు. ఆయనను ఉక్కు జనరల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు నేతృత్వంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మురికివాడను పరిశీలించిన డీఎంహెచ్‌వో



అప్పుఘర్‌లో మురికి వాడను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : నివాస ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకుంటే వ్యాధులను నిర్మూలించవచ్చని డీఎంహెచ్‌వో డాక్టర్ పి. జగదీశ్వరరావు తెలిపారు. శుక్రవారం అప్పుఘర్ ప్రాంతంలోని మురికివాడను సందర్శించి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. జిల్లా మలేరియా అధికారి తులసీరాజ్, ఇతర సబ్ యూనిట్ అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి వారం ఫ్రై డే డ్రై డే పాటించాలని తెలిపారు. దోమతెరలు వాడాలని, దోమల వల్ల మలేరియా, డెంగ్యూ రాకుండా చూసుకోవాలన్నారు. అనంతరం జీటీడబ్ల్యు పోస్టుమెట్రిక్ గర్ల్స్ హాస్టల్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులు, వార్డెన్లకు పలు సూచనలు చేశారు. జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి తదితరులు పాల్గొన్నారు.